క్లుప్తంగా

## ఆనంద్‌కు ఉత్తమ సేవారత్న పురస్కారం



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): శ్రీలక్ష్మీనారాయణ స్వచ్ఛందసేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆనంద్‌కుమార్ జాతీయ ఉత్తమ సేవారత్న పురస్కారం అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన వేదికలో అరిగపూడి పూర్ణచంద్రరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈఅవార్డును ప్రదానం చేశారు. పలు సేవాకార్యక్రమాలు చేపట్టినందుకుగాను తనకు ఈ అవార్డు లభించిందని ఆనందకుమార్ తెలిపారు. కార్యక్రమంలో జస్టిస్ చంద్రకుమార్, కృష్ణమూర్తి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

## సత్యసాయి సేవలు వెలకట్టలేనివి

రాజాపూర్: ఎన్నో సేవాకార్యక్రమాలు చేసి ప్రపంచస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న సత్యసాయి సేవలు వెలకట్టలేనివని సత్యసాయి ట్రస్టు సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని తిర్మలాపూర్ గ్రామంలో సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరంతో పాటు పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం శివాలయంలో శివుడికి అభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ కార్తీక్ మాట్లాడుతూ దైవస్వరూపుడు సత్యసాయి లేకున్నా ఆయన భక్తులు ఇలాంటి సేవాకార్యక్రమాలు నిర్వహించడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు భీమయ్య, వెంకట్, మోహన్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## 'మాజీ మంత్రిని విమర్శించే స్థాయి లేదు'

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకుడు సిరాజ్‌ఖాద్రికి లేదని బీఆర్‌ఎస్ పార్టీ మైనార్టీ నాయకుడు ఇమ్రాన్ అన్నారు. ఆదివారం ఆపార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సిరాజ్‌ఖాద్రి తనపై 420 కేసులు ఉన్నాయనే మాట మరిచి పాలమూరు అభివృద్ధి ప్రదాత శ్రీనివాస్‌గౌడ్‌పై విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఇలాంటి వాళ్లను పక్కన పెట్టుకొని తిరిగితే జనంలో విలువలేకుండా పోతుందని సూచించారు. సమావేశంలో సుల్తాన్ ఖదీర్‌పాషా, నయీమ్, మఖ్సూద్, ఫర్హాద్, ప్రభాకర్, పాల సతీష్, శ్రీనివాస్ రెడ్డి, అబ్దుల్లా, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

## మైసమ్మ తల్లికి భక్తుల ప్రత్యేకపూజలు



నవాబుపేట: మండలంలోని మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు మైసమ్మ తల్లికి ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అడవిలో పచ్చని చెట్లు, పక్షుల కిలకిల రావాల మధ్య భక్తులు సందడి చేశారు. దీంతో దేవాలయం, అటవీ ప్రాంతం భక్తులతో రద్దీగా మారింది.

## వడ్ల కుప్పలను ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

మిడ్జిల్: మండలంలోని బోయిన్‌పల్లి సమీపంలోని 167 జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి వడ్ల కుప్పలను ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్ తెలిపారు.. వివరాల మేరకు.. తలకొండపల్లి మండలానికి చెందిన పెరుమండ్ల శివ అనే యువకుడు బైక్‌పై వస్తూ గ్రామ సమీపంలోని వడ్ల కుప్పలను ఢీకొట్టాడు. అదుపు తప్పి కింద పడటంతో అతడిని తీవ్ర గాయాలయ్యాయి. 108లో జడ్చర్ల ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ చెప్పారు.

## ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలి

ధన్వాడ: తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ జరిగేంత వరకు ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కర్రెప్ప అలియాస్ కల్యాణ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీలో సీఎం రేవంత్ ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణ అమల్లోకి తీసుకొచ్చిన తరువాతనే ఉద్యోగాలు భర్తీచేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండానే 11వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసి మాదిగలకు ద్రోహం చేశారన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# 'డబుల్' ట్రబుల్



కావేరమ్మపేటలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూంల నుంచి పారుతున్న మురుగు

- కాలనీలో సమస్యల తిష్ట
- దెబ్బతిన్న డ్రెయినేజీ వ్యవస్థ
- దిగువ ప్రాంతాల్లోకి మురుగు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేట వద్ద నిర్మించిన 120 డబుల్ బెడ్‌రూం కాలనీలో సమస్యలు తిష్ట వేశాయి. జూలై 2023లో అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి 120మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలను అందజేశారు. కాలనీలో మౌళికసదుపాయాలు మాత్రం కల్పించలేకపోయారు. రెండు నెలల క్రితం కరెంట్ కనెక్షన్ రావటంతో 50మంది లబ్ధిదారులు తమకు కేటాయించిన ఇళ్లల్లో నివాసం ఉంటున్నారు. మిగిలిన లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసుకునేందుకు ఇళ్లను మరమ్మతులు చేసుకుంటున్నారు. ఇన్నాళ్లు సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతిన్నది. డ్రైనేజీ సంప్ నుంచి మురికినీరు బయటకు వెళ్లేందుకు సరైన ఏర్పాట్లు చేయలేదు. దీంతో మురుగు నేరుగా దిగువ ప్రాంతంలో ఉన్న కాలనీల్లోకి పారుతోంది. దీంతో ఆ కాలనీవాసులు డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులతో వాగ్వాదానికి దిగుతున్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని, మురుగునీరు సాఫీగా వెళ్లేందుకు కాలువలు నిర్మించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. స్థానిక కౌన్సిలర్ బుక్క మహేష్ కరెంట్ కనెక్షన్ ఇప్పించారు. మిషన్‌భగీరథ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ట్యాంక్‌కు కనెక్షన్ ఇవ్వటం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

**సమస్యలు పరిష్కరించాలి**



డబుల్‌బెడ్‌రూం కాలనీలో సమస్యలు తీర్చాలి. మురుగు బయటికి వెళ్లేందుకు కాలువ కట్టలేదు. దిగువ ప్రాంతాలకు మురికినీళ్లు వెళ్తుండటంతో ఆ కాలనీవాసులు గొడవకు దిగుతున్నారు. తాగునీటి తిప్పలు ఉంది. ట్యాంక్ అయితే కట్టిండ్రు మిషన్‌భగీరథ కనెక్షన్ ఇవ్వలేదు.

– అరుణ, లబ్ధిదారురాలు, కావేరమ్మపేట

## ప్రతిఒక్కరు ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి



పూజా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు

**మాజీ ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి**

నవాబుపేట: ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని మహబూబ్‌నగర్ మాజీ ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని యన్మన్‌గండ్ల పంచాయతీ తూర్క్యతండాలో ఆంజనేయస్వామి నూతన విగ్రహ పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మనిషికి ఆధ్యాత్మికత ఆయుషును పెంచుతుందన్నారు. గిరిజనులు అభివృద్ధిలో మరింత ముందుకు దూసుకుపోవాలని ఆయన ఆకాంక్షించారు. దేవాలయ నిర్మాణం కోసం తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. దాతలను గిరిజనులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు అభిమన్యురెడ్డి, మాజీ జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నర్సింహులు, ప్రతాప్, మాజీ ఎంపీపీ శ్రీనివాస్, లక్ష్మయ్య, శేఖర్‌రెడ్డి, హన్మంతు, రాంచంద్రనాయక్, హన్మంతునాయక్, రఘు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు దైవమార్గంలో నడవాలి



బోధనలు చేస్తున్న శంషాబాద్ ఎంబీ బైబిల్ కాలేజ్ అధ్యాపకుడు ఆర్.ఎజ్రా, హాజరైన క్రైస్తవ మహిళలు

చిన్నచింతకుంట: ప్రతి ఒక్కరు దైవమార్గంలో నడవాలని శంషాబాద్ ఎంబీ బైబిల్ కాలేజ్ అధ్యాపకుడు ఆర్.ఎజ్రా అన్నారు. ఆదివారం స్థానిక ఎంబీసీయోన్ చర్చిలో క్రైస్తవులు మూడు రోజుల పాటు ఘనంగా జరుపుకున్న కృతజ్ఞతల పండుగ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బైబిల్‌లోని పలు అంశాలను వారికి బోధించారు. కార్యక్రమంలో పాస్టర్ రేవ ఏఎస్ గిద్యోన్, చైర్మన్లు జి. యోన, జి.మోష, ఎస్.శేఖర్, పిలోగు పాల్గొన్నారు.

## మహాసభలను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీపీఎం మండల కార్యదర్శి లక్ష్మయ్య

హన్వాడ: ఈనెల 20న మహబూబ్‌నగర్‌లో నిర్వహించే సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి లక్ష్మయ్య పిలుపు నిచ్చారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలోని ఈకార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రజాసమస్యలు పరిష్కరించకుండా ఒకే దేశం, ఒకే ఎన్నిక అని ప్రజల ఆలోచనలను పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చిందని, వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల సీపీఎం నాయకులు టంకర రాములు, రేఖమయ్య, శ్రీకాంత్, రాములు, చుక్కయ్య, రాములు, తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తాం

జడ్చర్ల టౌన్: విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తామని డీఈ చంద్రమౌళి తెలిపారు. ఆదివారం జడ్చర్ల విద్యుత్ డివిజన్, రాజాపూర్ సబ్‌డివిజన్ కార్యాలయాల్లో నిర్వహించిన సదస్సుల్లో 24 ఫిర్యాదులు అందాయన్నారు. వాటిలో లైన్ మార్పిడి, పేరు మార్పిడి, గృహజ్యోతికి సంబంధించినవి ఉన్నట్లు చెప్పారు.



వినియోగదారుల దినోత్సవంలో ఫిర్యాదు అందిస్తున్న వినియోగదారులు

## ఘనంగా రంగోత్సవం పోటీలు



పోటీల్లో డ్రాయింగ్ వేస్తున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని రెయిన్‌బో పాఠశాలలో ఆదివారం ఘనంగా రంగోత్సవం జిల్లాస్థాయి పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా సీనియర్ న్యాయవాది బెక్కం జనార్దన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల కరస్పాండెంట్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకర విషయమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి మరిన్ని కార్యక్రమాలను నిర్వహించి విద్యార్థులను మరింత ప్రోత్సహిస్తామన్నారు. సీనియర్ విద్యార్థులకు రీసైకిల్, రీయూజ్, రీస్టోర్ అనే అంశం కాగా జూనియర్లకు న్యాచర్ బ్యూటీ అవర్ రెస్పాన్స్‌బిలిటీ అనే అంశంపై పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి మొత్తం 1600మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మమత, ట్రస్మా అధ్యక్షుడు ప్రభాకర్, వైస్ ప్రిన్సిపాల్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## పదోవార్డులో పర్యటించిన మున్సిపల్ చైర్మన్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక పదో వార్డు పరిధిలోని రబియా మసీదు, మర్లు ప్రాంతాల్లో ఆదివారం మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ పర్యటించారు. డ్రెయినేజీ వ్యవస్థ పూర్తిస్థాయిలో లేకపోవడంతో ఎక్కడికక్కడ మురుగు నిలిచి రోడ్లపైకి వస్తోందని స్థానికులు వాపోయారు. చాలా వరకు మట్టిరోడ్లే శరణ్యమయ్యాయని ఫిర్యాదు చేశారు. త్వరలోనే సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తామని ఆయన హామీ ఇచ్చారు.



మురుగును పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ తదితరులు

## పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడిగా స్వామి



సన్మానం పొందిన నూతన అధ్యక్ష, కార్యదర్శులు

హన్వాడ: పీఆర్‌టీయూ టీఎస్ మండల అధ్యక్షుడిగా కద్దాల స్వామి నియమితులయ్యారు. మండల పీఆర్‌టీయూ టీఎస్ అధ్యక్షుడిగా ఉన్న మదన్‌మోహన్‌యాదవ్ ఇటీవలే జిల్లా బాధ్యుడిగా ఎన్నికయ్యారు. దీంతో ప్రధాన కార్యదర్శిగా ఉన్న కద్దాల స్వామిని మండల అధ్యక్షుడిగా, విజయానంద్‌రెడ్డిని ప్రధానకార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా స్వామి, విజయానంద్‌రెడ్డిలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి సన్మానించారు.

## ధ్యానంతో ప్రశాంతత



మాట్లాడుతున్న సంజీవముదిరాజ్

హన్వాడ: ధ్యానంతో ప్రశాంతత కలుగుతుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజీవ ముదిరాజ్ అన్నారు. ఆదివారం మండలంలోని దాచక్‌పల్లిలో పిరమిడ్ 11వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ధ్యానం అలవర్చుకోవాలన్నారు. నిత్యం ధ్యానం చేయడం ద్వారా జ్ఞాపకశక్తి మెరుగవుతుందన్నారు. రాజకీయాల్లోకి ధ్యానులు ఉంటే సమాజం ఎంతో బాగుంటుందని పేర్కొన్నారు. అనంతరం సీనియర్ పిరమిడ్ మాస్టర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ సర్వరోగనివారిణి ధ్యానం అన్నారు. పిరమిడ్‌లో ధ్యానం చేస్తే రెట్టింపు శక్తి వస్తుందన్నారు. ధ్యానం చేసే విధానంపై మాస్టర్ సతీష్‌కుమార్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మాస్టర్లు పీ.శ్రీను, సీపీఐ నాయకుడు శంకర్, సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

## ఒలింపియాడ్ పరీక్షల్లో సత్తా చాటిన శ్రీచైతన్య



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): క్యాట్ లెవెల్‌వన్ ఒలింపియాడ్ పరీక్షల్లో పట్టణంలోని శ్రీచైతన్య బ్రాంచ్‌వన్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ఆదివారం ఆ పాఠశాలలో విద్యార్థుల అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ మనోహర్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులోఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. ఈఒలంపియాడ్ పరీక్షలకు తమ పాఠశాలకు చెందిన 155మంది విద్యార్థులు ఎంపికై నట్లు తెలిపారు. పాఠశాల అకాడమీ డీన్ యాదయ్య, ఐపీఎల్ ఇంచార్జీ శంకర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అవినీతిపరులను జైలుకు పంపిస్తా



పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి**

నవాబ్‌పేట: మండలంలో శానిటేషన్ నిధుల విషయంలో జరిగిన అవినీతిపై విచారణ జరిపించి అవినీతిపరులను జైలుకు పంపిస్తామని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రుద్రారంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. మండలంలో రోడ్ల అభివృద్ధికి రూ.50కోట్లు వెచ్చించినున్నట్లు ఆయన ప్రకటించారు. మండల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. కోల్లూర్ గ్రామంలో 111 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను మంజూరు చేయించామన్నారు. మండల ఏర్పాటుకు ప్రత్యేక కమిటీ వేసి దాని ద్వారా మండల ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు భయపడాల్సిన అవసరం లేదని, అవినీతి అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రుద్రారంలో నూతన పంచాయతీ భవనాన్ని, కొల్లూర్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. తూర్క్యతండాలో రూ.12లక్షలతో నిర్మించే హనుమాన్ దేవాలయానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, బంగ్లరవి, భూపాల్‌రెడ్డి, కృష్ణగౌడ్, వెంకటేష్, రాంచంద్రనాయక్, మధుసూదన్‌రెడ్డి, తులసీరాంనాయక్, నీల్యానాయక్, హమీద్, జమ్ము తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి**

చిన్నచింతకుంట: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం చిన్నచింతకుంట మండలంలోని పర్దిపూరం, దమగ్నాపురం, ముచ్చింతల గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తూ ప్రతి గింజను కొనుగోలు చేసేందుకు కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ముచ్చింతల, అప్పంపల్లి సింగిల్ విండో అధ్యక్షులు ఉమ మహేశ్వర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్, వట్టేం శివకుమార్‌లతోపాటు రైతులు తదితరులు ఉన్నారు.

**మత్స్యకారుల సంక్షేమానికి కృషి**

అడ్డాకుల: మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. రాచాల గ్రామంలో ప్రభుత్వం సరఫరా చేసిన చేప పిల్లలను ఆదివారం ఆయన స్థానిక చెరువులో వదిలారు. చేపల పెంపకంతో మత్స్యకారులు వృద్ధిలోకి రావాలని కోరారు. రాచాల, పొన్నకల్ గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులతో మాట్లాడారు. అడ్డాకుల శివారులోని ఎస్ఎస్‌వీ కాటన్ మిల్లులో సీసీఐ ద్వారా ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మార్కెట్‌కు వచ్చిన పత్తి తడువకుండా సీసీఐ అధికారులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట శ్రీహరి, నాగిరెడ్డి, నాగార్జున్‌రెడ్డి, విజయమోహన్‌రెడ్డి, లింగారెడ్డి, తిరుపతయ్య, దశరథ్‌రెడ్డి, హేమవర్ధన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, నర్సిములు తదితరులు ఉన్నారు.

## భక్తులకు ఇబ్బందులు కలిగించొద్దు

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలిగించొద్దని ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం మండలంలోని కురుమూర్తి స్వామి జాతర ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారన్నారు. వారికి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, విద్యుత్ తదితర వసతులు కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఓఈ మధనేశ్వరెడ్డిలతోపాటు పలువురు పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ఉచిత వైద్యశిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

మహమ్మదాబాద్: వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న నిరుపేదలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ డీసీసీబీ చైర్మన్ కమతం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో గ్యాస్ట్రోలివర్ ఎండోస్కోపి సెంటర్ వైద్యుడు వివేక్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గ్యాస్ట్రో, లివర్, ఎండోస్కోపి లాంటి బాధలు ఉన్నవారు ఈ శిబిరాల్లో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈసందర్భంగా 240మందికి వివిధ రకాలైన పరీక్షలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేఎం.నారాయణ, మాజీ ఎంపీపీ శాంతిబాయి, సూపర్‌వైజర్ రామకృష్ణ, పత్తిగోపాల్, దస్తయ్య తదతరులు పాల్గొన్నారు.

## కరాటే టోర్నీలో కింగ్‌షోటోకాన్ ప్రతిభ



పతకాలు సాధించిన కింగ్‌షోటోకాన్ విద్యార్థులు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని లార్డ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 2న జరిగిన ఇంటర్ కళాశాల కరాటే టోర్నమెంట్‌లో జిల్లా కేంద్రానికి చెందిన కింగ్‌షోటోకాన్ కరాటే క్లబ్ విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రి తెలిపారు. ఈ టోర్నీలో క్లబ్ విద్యార్థి ఉజేఫ్ షరీఫ్ కటాస్, కుమితే (వ్యక్తిగత) విభాగాల్లో బంగారు పతకాలు సాధించాడు. త్వరలో భూపాల్‌లో జరిగే సౌత్‌జోన్ యూనివర్సిటీ కరాటే టోర్నమెంట్‌కు ఎంపికై నట్లు తెలిపారు. మరో విద్యార్థి అర్ష్ జమీల్ రెండోస్థానంలో నిలిచి రజత పతకం సాధించాడు. విద్యార్థులను లార్డ్స్ కళాశాల ఫిజికల్, స్పోర్ట్స్ డైరెక్టర్ హబీబ్‌ఖాన్, ప్రిన్సిపాల్ డాక్టర్ రవికిషోర్‌సింగ్ మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. పతకాలు సాధించిన విద్యార్థులను జహంగీర్‌పాష ఖాద్రి అభినందించారు.

# శ్రీశైలం బస్సు ప్రారంభం



ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న చైర్మన్లు

నారాయణపేట రూరల్: కార్తీకమాసం సందర్భంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామిని దర్శించుకునేందుకు శ్రీశైలం వెళ్లేభక్తుల సౌకర్యార్థం పేట నుంచి ప్రత్యేక బస్సును ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆదివారం స్థానిక డిపోలో నూతన సర్వీసును మున్సిపల్, మార్కెట్ కమిటీ చైర్మన్లు గందె అనసూయ, రాంపురం సదాశివరెడ్డి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. ఎంతో పవిత్రమైన కార్తీక మాసంలో నదీస్నానం ఆచరించడం, పరమేశ్వరుడిని దర్శించుకునేందుకు ఎంతో మంది ప్రజలు శ్రీశైలం వెళ్లడం ఆనవాయితీగా వస్తుందని, అలాంటి వారి సౌకర్యార్థం బస్సును నడిపించాలని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ఆదేశించడంతో బస్సు సర్వీసును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. భక్తులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతీరోజు ఉదయం 8:20గంటలకు పేటలో మధ్యాహ్నం 3:30గంటలకు శ్రీశైలంలో తిరుగు ప్రయాణం అవుతుందన్నారు. కార్యక్రమంలో డీఎం లావణ్య, కౌన్సిలర్ సలీం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హన్మంతు, నాయకులు గందె చంద్రకాంత్, మాధవరెడ్డి, రఘువీర్, మారుతి, శరణప్ప, వెంకట్రాములు, కార్తీక్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.